# అతి మెత్తని సంసారము



నాకు చాలా ఆశ్చర్యంగా, విచిత్రంగా ఉంది...!

ఆ జంట అన్నివిధాలా 'ఫుల్ పెర్ఫెక్ట్' అంటున్నారు... ఫిజికల్గా, మెంటల్గా, ఆస్ట్రనామికల్గా... వగైరా, వగైరా... అన్నివిధాలా వాళ్ళు పెర్ఫెక్ట్గా ఉన్నారట..! కానీ.. ఇంత వరకూ సంతానం లేదు..! కారణం ఏమిటి...?

అదొక మిలియన్ డాలర్ క్వశ్చన్ అయిపోయింది నాకు, మా అందరికీ...!

అడ్రస్ సులువుగానే దొరికింది.

"రా మావయ్యా!.... చాలాకాలానికి వచ్చావ్... అత్తయ్యా, పిల్లలూ రాలేదా...? నువ్వొక్కడివే వచ్చావా...? ఎన్నాళ్ళు శలవులు...?" అంటూ ప్రశ్నలవర్షం కురిపించింది తలుపుతెరిచిన శ్రీలత ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోతూ.

చాలా తాపీగా అన్ని ప్రశ్నలకీ జవాబులు చెప్పాను. భోజనం చేసేవచ్చానని తెలిసి చకచకా ఇన్స్టెంట్ ఉప్మా చేసి, హార్లిక్స్ కలిపి ఇచ్చింది.

మాటల మధ్యలో చాలా కాజువల్గా అడిగినట్లు వాళ్ళ సంసారం గురించి చాలా ప్రశ్నలు అడిగాను. ఇంకా పిల్లలు పుట్టలేదన్న దిగులు, అత్తగారి అసంతృప్తి తప్ప వాళ్ళ సంసారం స్వర్గంలాగే ఉంది. భర్త జయరాం చాలా మంచివాడు. తన భార్యకి - తల్లికీ మధ్య అసంతృప్తి పెరగకుండా ఉండడం కోసం తెలివిగా, గుట్టుగా ట్రాన్స్ఫర్ చేయించుకుని భీమవరంలో కాపురం పెట్టాడు. ఈ విషయాలన్నీ మా అక్క చెప్పినవే అయినా... కళ్ళింతలు చేసుకుని శ్రీలత చెబుతుంటే... నా మనసుకి చాలా తృప్తిగా అనిపించింది.

జయరాం ఆఫీసు నుంచి ఫోన్ చేశాడు.. కొంచెం అర్జంటు పని ఉందనీ, రావడం ఆలస్యం అవుతుందనీ... శ్రీలత నేనొచ్చిన సంగతి చెప్పింది ఆనందంగా.

"ముసలమ్మ లాగా ఆ పూజలూ, వ్రతాలూ చేస్తున్నావా? మానేసావా...?" అడిగాను. శ్రీలత మా అక్కకూతురే అయినా ఎక్కువగా మా ఇంట్లోనే పెరిగింది. వాళ్ళ అమ్మ, అమ్మమ్మల్లాగే చిన్నతనం నుంచీ పూజలూ, పునస్కారాలూ అంటూ సాంప్రదాయాలన్నీ పుణికి పుచ్చుకుంది. ఇంత చిన్నవయసులోనే ఇవన్నీ నీకెందుకే అంటే వినిపించుకునేది కాదు 'పడుచు ముసలమ్మ' అనే పేరు కూడా సంపాదించుకుంది.

నా ప్రశ్నకి సమాధానంగా చిరునవ్వు నవ్వేసి, "ఇల్లుచూద్దువు గాని రా మావయ్యా..." అంటూ... ఇల్లంతా తిప్పి చూపించింది. నాలుగు పోర్షన్ల బిల్డింగది.. రెండు బెడ్రూమ్లు, హాలు, కిచెన్ వగైరాలతో... చాలా సౌకర్యంగానే ఉంది. ఇల్లంతా దేవుళ్ళు, దేవతల పటాలతో నిండి ఉన్నా... బెడ్రూమ్లో మాత్రం అందమైన సీనరీలు, సినీతారల చిత్రాలతో ఉండడం చూసి...'ఫర్వాలేదు అబ్బాయి రసికుడే' అనుకున్నాను మనసులో...

వాళ్ళ బెడ్రూమ్ చూపిస్తూ... మంచం మీద దుప్పటి సరిచేసి "కూర్చో మావయ్యా... నువ్వు కొన్న పరుపే ఇది... న్యూజిలాండ్ పరుపు...! అంటూ నవ్వింది. నేనూ నవ్వాను... కూర్చుంటే మెత్తగా హాయిగా ఉంది.

శ్రీలతకి పెళ్ళయ్యేనాటికి నేను ఉద్యోగధ

**జవ్వాది సుబ్రహ్మణ్య వరప్రసాద్**

ర్మంగా సింగపూర్‌లో ఉన్నాను. పెళ్ళికి రావడం కుదరలేదు. ఉద్యోగంలో చేరింది కొత్త, పైగా సుదూర దేశం...! ఆ తర్వాత ఐదారు నెలల కనుకుంటాను... మా అందరికీ 'ఇండియా' వచ్చే అవకాశం కలిగింది. అప్పటికి శ్రీలతకి 'సారె' పెట్టి అత్తవారింటికి పంపే ఏర్పాట్లు జరుగుతున్నాయ్. మా అక్కా బావా సామాను కొనడానికి వెళుతుంటే వారి కూడా నేనూ వెళ్ళి, నా గిఫ్టుగా కొనిచ్చిన పరుపది. 'న్యూజిలాండ్ మేట్రస్' అత్యంత అధునాతనమైంది, ఖరీదైందీ కూడా!

అప్పట్లో నాకు తెలియలేదు 'అతిమెత్తటి తప్పు' చేస్తున్నానని....?

"ఇది చదువుతూండు మావయ్యా... ఇప్పుడే వస్తాను" అంటూ ఏదో మ్యాగజైన్ ఇచ్చి వెళ్లింది శ్రీలత, ఆలోచనల్లోంచి తేరుకుని పుస్తకం చేతిలోకి తీసుకున్నాను. అప్పుడు టైం ఐదుగంటలయింది. దిండుకి జారబడి రిలాక్స్‌గా పుస్తకం తెరిచాను....!

"మావయ్యా... మావయ్యా...!" అనే పిలుపుకి ఉలిక్కిపడి కళ్ళు తెరిచాను. ఎదురుగా శ్రీలత, జయరాంలు నిలబడి నవ్వుతున్నారు. కంగారుగా లేచి టైం చూశాను.. ఆరుంబావు...!!!

"అరె... ఎంతసేపయింది వచ్చి...? అడిగాను ఆశ్చర్యపోతూ...!

"నేనొచ్చి చాలాసేపయిందిలెండి... మిమ్మల్ని డిస్టర్బ్ చేయడం ఎందుకని లేపలేదు. మీరు



హైదరాబాద్ త్యాగరాయ గానసభలో కందుకూరి వెంకట మహాలక్ష్మి కథా సంపుటి "రష్యన్ సీత" ఆవిష్కరణ సందర్భంగా రచయిత్రిని సన్మానిస్తున్న రాష్ట్ర సాంస్కృతికశాఖ సంచాలకులు డా॥ రాళ్ళబండి కవితా ప్రసాద్, ప్రక్కన అధ్యక్షురాలు డా॥ వాసా ప్రభావతి

స్నానం చేస్తారేమో చేసెయ్యండి, భోజనం చేస్తూ మాట్లాడుకోవచ్చు... అన్నాడు జయరాం.

ఎన్నిమైళ్ళు ప్రయాణం చేసినా అలసట తెలియదు నాకు - పగలు నిద్రపోయే అలవాటు లేదు...! అలాంటిది ఇదేమిటి..? నాకే చాలా సిగ్గుగా అనిపించింది.

"స్నానం చేసివస్తాను..." అంటూ అక్కణ్ణించి జారుకున్నాను.

స్నానం చేసి పూజగదిలో కాసేపు 'ధ్యానం' చేసుకుని వచ్చేసరికి ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. వాళ్ళ బెడ్‌రూమ్ వైపు వెళ్ళాను తలుపులు తెరిచే ఉన్నాయ్..! లోపలికి చూసి... షాక్ తిన్నాను...!?

మంచానికి అడ్డంగా పడుకుని గుర్రుపెడుతున్నాడు జయరాం. మరొక చివర కూర్చున్న స్థితిలోనే కళ్ళుమూసుకుని కునికిపాట్లుపడుతోంది శ్రీలత.

వాళ్ళని ఎలా పిలవాలో అర్థం కాలేదు నాకు. చిన్నగా రెండుసార్లు దగ్గాను... శ్రీలత ఉలిక్కిపడి లేచింది. సిగ్గుపడుతూ భర్తని లేపింది. నన్ను చూసి ఇబ్బందిగా నవ్వాడు జయరాం. "ఏమిటో మంచం మీద ఇలా వాలితే అలా నిద్ర వచ్చేస్తుంది బాబాయ్‌గారూ"... అన్నాడు.

మా ఇద్దరికీ భోజనం వడ్డించి తను 'టిఫిన్' చేసుకుంది శ్రీలత. ఆ రోజు ఏదో పూజ చేసుకుందట...! ఉపవాసమట... సంతానం కోసం!

భోజనం చేస్తూ జయరాం చాలా విషయాలు చెప్పాడు - ఏ ఏ హాస్పిటల్స్‌లో ఏ ఏ టెస్టులు చేయించారో, పెద్దవాళ్ళు చెప్పిన మీదట ఏ ఏ పుణ్యక్షేత్రాలు తిరిగి వచ్చారో, ఏఏ బాబాల్నీ- అమ్మల్నీ... అమ్మమ్మల్నీ సేవించారో! ఎన్ని మందులు మింగారో... ఏ జ్యోతిష్యుల్ని కలిశారో... అన్నీ... మా అక్కా, అమ్మా అంతా చెప్పిన విషయాలే... మళ్ళీ చెప్పాడు. నాకు చాలా జాలేసింది. దాంతోబాటూ బుర్రలో ఏవేవో ఆలోచనలు సుళ్ళు తిరగసాగాయ్..

ఆ రాత్రికే మా ఊరు వెళ్ళిపోదాం అనుకున్నా. కానీ వాళ్ళు వప్పుకోలేదు.

రెండో బెడ్‌రూమ్‌లో నాకు పక్క వేసింది శ్రీలత. సుమారు గంటన్నరసేపు అటూ ఇటూ దొర్లాక గానీ నిద్ర రాలేదు... అదికూడా కలత నిద్రే...!? నిద్రలో ఏవేవో గజిబిజి కలలు, కలల్లో పిచ్చి సినిమాలు, పిచ్చిపిచ్చి టివీ సీరియల్స్... మధ్య మధ్య వింతలూ విడ్డూరాల ఎడ్వర్టయిజ్‌మెంట్స్.

గజిబిజి ఆలోచనల్నిటికీ ఒకేసారిగా ఒక రూపం వచ్చిందేమో...! నిద్రలోనే యురేకా...! అని అరుస్తూ ఒక్కసారిగా లేచి కూర్చున్నాను.

మర్నాడు ఉదయం మా ఊరికి బయలుదేరే ముందు శ్రీలతని, జయరాంనీ కూర్చోబెట్టి చెప్పాను.

"చూడండీ...ఇంటికి వాస్తు బాగోకపోతే ఇంటికి సమస్యలు ఎలా వస్తాయో... బెడ్‌రూమ్ వాస్తు బాగోకపోతే దానికి సంబంధించిన సమస్యలూ అలాగే పుడతాయి. పెళ్ళయి ఇన్ని సంవత్సరాలైనా మీకు సంతానం కలగకపోవడానికి, ఆ కారణంగా అయినవాళ్ళ మధ్య అశాంతికీ అదే కారణం...! నాకు ఈ విషయం రాత్రే తెలిసింది. రాత్రి గెస్ట్‌రూమ్‌లో నిద్రపట్టక చాలా అవస్థ పడ్డాను, ఆ పడక అలా ఉంది మరి... అంటే మీ ఇంటికి వచ్చిన అతిథుల పరిస్థితీ అలానే ఉంటుందన్నమాట... వాళ్ళ ఉసురే మీకు తగులుతుందేమో...!" అంటూ

నవ్వాను. అర్థంగాక వాళ్ళు అయోమయంగా చూసారు.

"నిజంగానే ఇన్నాళ్ళూ మీకు సంతానం కలుగకపోవడానికి అదే కారణమేమో అనిపిస్తోంది... ఈ దోషం పోవాలంటే... కొన్నాళ్లు మీరు 'నిద్రా సుఖం' మరిచిపోవాలి - అందు కోసం మీ బెడ్‌రూమ్‌లో ఉన్న ఆ మెత్తటి పరుపుని గెస్ట్‌రూమ్‌లో వేయండి - అక్కడి పరుపు మీరు వేసుకోండి. బహుశా అది మీ పెద్దలెందరికో సంతానం ప్రసాదించిన పరుపే అయ్యుంటుంది... ఎంతోకాలం అక్కర్లేదు రెండు మూడు నెలలు చాలు... మీ కంటే పెద్దవాణ్ణి... ఎందుకు చెబుతున్నానో... వినండి... ఎందుకు? ఏమిటి...?? అని అడక్కుండా చెప్పినట్టు చేయండి... చేస్తారా...?" అంటూ సూటిగా వాళ్ళ మొహాల్లోకి చూశాను.

ఇద్దరూ... అయోమయంగా... వినయంగా... బుద్ధిగా తలాడించారు.

నేను సింగపూర్ తిరిగి వచ్చేసిన రెండు నెలల తర్వాత... ఒక రోజు జయరాం ఫోన్‌చేసి శ్రీలత కన్సీవ్ అయిన సంగతి చెప్పాడు చాలా ఆనందంగా...! అక్క కూడా ఫోన్‌చేసింది. మొదటిసారిగా నేను తండ్రి అయినప్పటికంటే ఎక్కువే ఆనందం కలిగింది నాకు.

మరికొన్ని నెలలు గడిచాక... ఒకరోజు రాత్రి పదిగంటలు అవుతూండగా వెంటవెంటనే రెండు ఫోన్లు వచ్చాయి... ఒకటి అక్క బావా, రెండోది జయరాం. శ్రీలతకి అమ్మాయి పుట్టిందట. తమ ఇద్దరి పేర్లలోని మొదటి అక్షరాలు కలిపి బేబీకి 'శ్రీజ' అని పేరు పెడదామనుకుంటున్నారట. బారసాలకి తప్పకుండా వచ్చి తీరాలని నాకు ప్రత్యేకంగా బ్రహ్మాండమైన పార్టీ ఇస్తానని మరీ మరీ చెప్పాడు జయరాం.

> "పులికి, మేకకీ తేడా ఏమిట్రా?" అడిగాడు టీచర్ విద్యార్థిని.
>
> "మొదటిది క్రూర జంతువు, రెండోది కూర జంతువూ సార్!" సమాధానం చెప్పాడు విద్యార్థి.

పదే పదే కృతజ్ఞతలు కూడా తెలియజేసాడు.

పాలగ్లాసు టీపాయ్ మీదపెట్టి వెళ్లబోతున్న భారతితో చెప్పాను ఆ సంగతి ఆనందంగా... విజయగర్వంగా...!

"ఆరు సంవత్సరాల క్రితం మీరా 'ఘనకార్యం' చేసుండకపోతే ఈ పాటికి ఆ పిల్ల కాన్వెంట్‌కి వెళుతుండేది..."! అంటూ నవ్వింది.

నా మనసు కొద్దిగా గిల్టీగా ఫీలయ్యింది. దాన్ని కప్పిపుచ్చుకోవడానికి చటుక్కున ఆమె జడని అందిపుచ్చుకుని నా మెడ చుట్టూ చుట్టుకున్నాను.

"ఆ ఘనకార్యానికి పరిహారం చేసేశాను గా...!" అన్నాను మత్తుగా...!

"ఈ ఘనకార్యాన్ని మాత్రం వాయిదా వెయ్యండి. పిల్లలింకా పడుకోలేదు" అని నవ్వుతూ 'జడ' విడిపించుకుని వెళ్ళిపోయింది.

ఇవాళ ఎలాగైనా సరే భారతి పనులన్నీ ముగించుకుని బెడ్‌రూమ్‌లోకి వచ్చేవరకూ మెలకువగా ఉండితీరాలని గట్టిగా నిశ్చయించుకుంటూ... పాలు త్రాగేసి బెడ్‌మీద వాలాను ఆనందంగా...

అదే నేను చేసిన పొరబాటు... 'మెత్తని పొరబాటు'...! అదీ రెండేళ్ళ క్రితం కొన్న 'న్యూజిలాండ్ మేట్రస్'...!! శ్రీలతకి కొన్న లాంటిదే...!!!